




## (గత సంచిక తరువాయి)

13

మోహన్ డిశ్చార్జ్ అయాడు.

ఇటు నాంచారమ్మ ఇంట్లో కానీ, అటు చాముండేశ్వరి ఇంట్లో కానీ ఎలాంటి సందడి, శబ్దం లేదు. ప్రతి నిమిషం ఏం మాట్లాడితే ఏం జరుగుతుందో అన్నట్టు అందరూ గుండె గుప్పిట్లో పెట్టుకుని గడుపుతున్నారు. పవిత్రని ఇంట్లోనుంచి కదలకుండా చూడమని అందరినీ గట్టిగా హెచ్చరించాడు మాధవ.

నాంచారమ్మకి వర్ధనికి కూడా ఒక్కసారి వెళ్ళి మోహన్ ని చూసి, పలకరించి రావాలని ఉంది. కానీ, పక్క ఇంట్లోనుంచి చిన్న సంకేతం కూడా లేదు. డిశ్చార్జ్ అయిన రోజు కారు గేటు లోపలికి తీసుకుని వెళ్ళాడు పార్ధసారధి. కాంపౌండ్ వాల్ ఎత్తుగా ఉండడం వల్ల కనీసం గోడ మీద నుంచి చూడ్డానికి కూడా వీలు కాలేదు. ఇంటికి వెళ్ళి చూడాలంటే ఎవరూ కన్నెత్తి చూడడం లేదు.

ఎందుకో నాంచారమ్మ మనసులో మోహన్ పట్ల ఒక అవ్యాజమైన ఆపేక్ష ఏర్పడింది. అందులోనూ ఆ అబ్బాయిని ఎవరో చంపడానికి ప్రయత్నించారు అన్న విషయం తెలిసాక అతనంటే విపరీతమైన జాలి కూడా కలుగుతోంది.

ఎవరికి ఏమి అపకారం చేసాడు ఈ అబ్బాయి. పాపం ఎందుకు అతనంటే అందరికీ ద్వేషం? అని ఆవిడ తల్లడిల్లిపోతోంది.

ఆనాడు చాముండేశ్వరిని అత్యంత నీచంగా అవమానించింది. ఒక తల్లిగా కొడుకు మనసులో ఉన్న కోరిక తెలుసుకుని, ఆ కోరిక తీర్చడానికి ఆవిడ ప్రయత్నం ఆవిడ చేసింది. అందులో తప్పేముంది? ఎందుకు అంత ఆవేశపడింది తను.

నిజానికి ఆ కుటుంబంతో ఎంతో అనుబంధం ఉంది. పార్ధసారధి కానీ, చాముండేశ్వరి కానీ ఏనాడూ తనని కానీ, కోడలిని కానీ, కొడుకుని కానీ పన్నెత్తి ఒక మాట అనలేదు. పైగా మాధవని ఎంతో గౌరవిస్తాడు పార్ధసారధి. ఎంతో సంస్కారం ఉన్న మనుషులు. ఆవిడ కూడా దసరా నవరాత్రులకు వర్ధనిని, పవిత్రని ఎంత ఆదరించి, గౌరవించింది. ఆరోజే పవిత్ర పట్ల ఆవిడ చూపించిన ప్రేమాభిమానం అనూహ్యం. అమ్మవారి పూజలు నిష్టగా చేసుకుని, నిత్యం పార్వతీ దేవిలా

కనిపించే ఆ ఇల్లాలిని ఎంత బాధపెట్టింది! అప్రయత్నంగా ఆవిడ కళ్ళు చెమర్చాయి. చిటికెన వేలితో కంటి చివర నిలిచిన కన్నీటి బొట్టు తుడుచుకుని, ఎదురుగా గోడ మీద ఉన్న నిలువెత్తు వెంకటేశ్వర స్వామి పటానికి నమస్కరిస్తూ "నన్ను క్షమించు తండ్రీ" అనుకుంది.

వర్ధనికి కూడా మనసంతా వేదనతో నిండిపోయింది. బంగారంలాంటి పిల్లాడు. అందంగా లేకుంటే ఏం? బుద్ధిమంతుడు. ఆరోజు అతను సమయానికి ఆదుకోకపోయి ఉంటే నాంచారమ్మ పరిస్థితి ఏమిటి? తనకేం సంబంధం అని పవిత్ర చెడు దారిలో వెళ్తోందని తల్లడిల్లిపోతూ పనిగట్టుకుని వచ్చి చెప్పాడు. మంచి చెప్పినా అతనేదో నేరం చేసినట్టు మాధవ అతని పట్ల కఠినంగా ప్రవర్తించాడు. అతను చెప్పకపోయి ఉంటే పవిత్ర, శివతో ఎంత దూరం వెళ్ళేదో. ఏం జరిగేదో! ఏది ఏమైనా తన కుటుంబ సభ్యులను ఎంతో గౌరవిస్తూ, అభిమానంగా ఉండే కుటుంబంతో మనస్తాపాలు ఏర్పడి, ఇవాళ ఈ ఇంటి మీది కాకి కూడా ఆ ఇంటి మీద వాలడానికి భయపడే పరిస్థితి వచ్చింది. ఇలా ఎందుకు జరిగింది! ఇన్నేళ్ళ నుంచీ ఈ ఊళ్ళో ఉన్నా, ఎంత పరువు ప్రతిష్టలు ఉన్నా, ఈ కుటుంబంతో ఏర్పడిన బంధం ఇంకెవ్వరితో ఏర్పడలేదు. అలాంటిది... ఆవిడకి దుఃఖం వచ్చేసింది. నిశ్శబ్దంగా కన్నీరు కార్చింది.

మాధవకి పార్ధసారథి అర్ధాంతరంగా తనతో వ్యాపార సంబంధాలు తెంచేసుకోడంతో చేయి విరిగినట్టు అయింది. ఒకసారి మనసు విప్పి మాట్లాడి, తనేదన్నా తప్పుగా ప్రవర్తిస్తే క్షమించమని అడగాలని ఉంది. మోహన్ పట్ల తను ప్రవర్తించిన విధానానికి వివరణ ఇవ్వాలని ఉంది. తానంటే ఎంతో గౌరవం ప్రదర్శిస్తూ, తనేం చెప్పినా కాదనకుండా అంగీకరించే మంచి భాగస్వామి. ఆర్ధిక విషయాల్లో కూడా ఏనాడూ ఒకళ్ళని ఒకళ్ళు మోసం చేసుకోలేదు. అతను ఎప్పటికప్పుడు కొత్త , కొత్త డిజైన్ చేసి, 'ఇలా బాగుంటుంది మాధవగారూ! ఇప్పుడు జనం ఆధునిక సౌకర్యాలకి అలవాటు పడుతున్నారు. వంటగది ఇలా ఉంటే ఆడవాళ్ళకి సౌకర్యంగా ఉంటుంది. బెడ్ రూమ్ విశాలంగా ఉండి, ఇలా కిటికీల పక్కన సోఫాలు వేసుకుంటే, కూర్చుని ఏ పుస్తకమో చదువుకోవచ్చు, అస్తమానం పడుకోరు కదా!' ఇలా అంటూ తనకి ఎన్ని సలహాలు ఇచ్చేవాడు! ఆర్చిటేక్చర్ కి సంబంధించిన ఇంగ్లీష్ మాగజైన్స్ చదువుతూ, అందులో వచ్చిన డిజైన్ లు అన్నీ మన గుడివాడలో మనం కట్టాలి... గుడివాడ అందరికీ ఆదర్శం కావాలి అనేవాడు.

ఎందుకిలా జరిగింది? ఇంక ఈ బంధం తెగిపోయినట్టేనా! అలా అనుకోగానే ఆయన గుండె బరువెక్కింది.

పవిత్రకి తను కోరుకున్న వాడితో పెళ్లి నిశ్చయం అయిందని, మరికొన్ని రోజులలో తను అర్ధాంగిగా అతని జీవితంలోకి వెళ్ళిపోతుందన్న ఆనందపు పరిమళం హటాత్తుగా మాయమై పోయింది. ఒక పక్క దుఃఖం తో, మరోపక్క భయంతో అసహనంగా తిరుగుతోంది. మోహన్ కి ప్రమాదం ఎలా జరిగింది? దీనికి కారణం ఎవరు? ఒకసారి వెళ్లి శివతో మాట్లాడాలి అంటే తనని గడప దాటనీయడం లేదు ఇంట్లో ఎవరూ. తల్లి ఏ పని చేస్తున్నా మధ్య, మధ్య తనకి కాపలా కాస్తోంది. తండ్రి వద్దు అన్నా, సినిమాలకి వెళ్ళడానికి నాంచారమ్మ మీద పనిచేసిన మంత్రం ఇప్పుడు ఏ మాత్రం

పని చేయడం లేదు. పవిత్ర ఎంత బతిమాలినా, ఆవిడ "మీ నాన్న ఇంట్లోంచి కదలనివ్వద్దు అని కచ్చితంగా చెప్పాడు. నాలుగు రోజులు ఆగు... ఆ మూడు ముళ్ళు పడితే, నీ ఇష్టం వచ్చినట్టు తిరుగుదువుగాని" అంటోంది.

శివ అయినా రావచ్చు కదా అనిపిస్తోంది. వారం అయింది తనని కలిసి. అతనికి కనీసం ఎందుకు రావడం లేదు ఒకసారి కలవాలి అన్న కోరిక లేదా? ఊళ్ళో లేడా? హాస్పిటల్ లో బిజీ గా ఉన్నాడా? ఆమెకి అంతా అయోమయంగా, ఊపిరాడనట్టుగా ఉంది.

కనీసం మోహన్ ని కలిసి, అసలు ఎవరు నిన్ను కొట్టింది? నీకెవరి మీదనన్నా అనుమానంగా ఉందా? నీకు ఎవరితో ఏమన్నా గొడవలు ఉన్నాయా అని అడగాలంటే ఆ ఇంటి తలుపులు నిత్యం మూసి ఉంటున్నాయి. మోహన్ మీద జరిగిన హత్యాప్రయత్నం తన కుటుంబ సభ్యులే చేయించారని, పార్ధసారది, చాముండేశ్వరి బలంగా నమ్ముతున్నారు. ఆ ఇంటిమీద కాకి, ఈ ఇంటిమీద వాలడం లేదు, వాళ్ళు పీల్చి వదిలిన గాలికూడా ఇటు రావడానికి భయపడి, సుడులు తిరిగి ఎటో వెళ్ళిపోతోంది.

పవిత్రకి తన పెళ్ళికి ముందు ఇలా అయిందేమిటి అని దిగులుగా ఉంది. గొంతెత్తి హాయిగా ఆలపించాల్సిన జీవనరాగంలో ఏదో అపశ్రుతి... తన గదిలో విచారంగా కూర్చుని ఉంటోంది. కనీసం ఎప్పుడూ చనువుగా వచ్చేసి, గలగలా కబుర్లు చెప్పే స్నేహితురాళ్ళు శ్రీదేవి, నాగమణి, సత్య కూడా రావడం లేదు. హటాత్తుగా అందరూ తన మీద కత్తి కట్టినట్టుగా అనిపిస్తోంది.

రోజులు భారంగా గడుస్తున్నాయి.

మాధవ పెళ్లి పనులు నిశ్శబ్దంగా చేసుకుంటున్నాడు.

"ఇంటికి వెల్ల వేయించాలి కదా" అంది వర్ధని.

"ఏమి అవసరం లేదు. బానే ఉంది. అలాంటి హడావుడి చేయకుండా పెళ్లి కానిచ్చేయాలి." అన్నాడు.

ఒక్కగా నొక్క కూతురు పెళ్లి నిరాడంబరంగా చేయడమా? ఏంటి ఈ ఖర్మ అనుకుంది వర్ధని. భర్తకి సమాధానం చెప్పే ధైర్యం ఆవిడకి లేదు. ఇప్పుడు అసలే లేదు.

ఆరోజు శనివారం ఉదయం, ఎనిమిదిన్నర ప్రాంతంలో మంచం మీద బద్దకంగా అటూ, ఇటూ పొర్లుతున్న పవిత్రకి చిరపరిచితం అయిన కారు హార్న్ వినిపించింది. బ్లాంకెట్ విసిరేసి, ఒక్క ఉదుటున మంచం దిగి గదిలో నుంచి పరుగులు పెడుతూ బయటకు వచ్చింది.

అప్పుడే గుమ్మంలో అడుగుపెట్టాడు శివ.

మాధవ స్నానం చేసి, పట్టు పంచె కట్టుకుని, మంత్రాలు చదువుతూ హాల్లోకి వచ్చాడు.

నాంచారమ్మ వంటగది గుమ్మం ముందు కూర్చుని విష్ణు సహస్ర నామాలు చదువుకుంటోంది. వర్ధని వంటగదిలో ఉంది.

"గుడ్ మార్నింగ్ మావయ్యగారూ!" శివ స్వరం నాదస్వరంలా వినిపించింది పవిత్రకి. చెంగు, చెంగున మెట్లు దిగింది.

ఆమె కాళ్ళకున్న వెండిమువ్వలు సన్నాయి పాడాయి.

కళ్ళల్లో కాంతులు, నడకలో తడబాటు, పెదవుల మీద చిరునవ్వు నడచివస్తున్న నందనవనం లా ఉన్న పవిత్రని ముందు చూసిన శివ "పవిత్రా" అంటూ నాలుగడుగులు ముందుకు వేసాడు.

మాధవ చివ్వున వెనక్కి తిరిగాడు.

శివ వైపు నడవబోతున్న పవిత్ర, పవిత్రవైపు అడుగులు వేస్తున్న శివ మంత్రం వేసినట్టు ఆగిపోయారు.

చెదిరిన జుట్టు, నైటీ, అప్పుడే నిద్రమంచం మీద నుంచి లేచివచ్చిన కూతురు వైపు చూసి, గంభీరంగా అన్నాడు మాధవ "వెళ్లి మొహం కడుక్కురా..." ఈ మాట అని శివ వైపు చూసి మర్యాదగా అన్నాడు"కూర్చోండి".

శివ పవిత్ర వైపు చూసాడు. ఆ చూపులో ఆమెకి "వెళ్ళు. నువ్వు వచ్చేదాకా ఉంటాను" అన్న హామీ కనిపించింది. గిరుక్కున వెనక్కి తిరిగి పైకి వెళ్ళిపోయింది.

శివ సోఫాలో కూర్చున్నాడు. ఆయన మరో సోఫాలో కూర్చుని, "ఎలా ఉన్నారు? మీ పిన్నిగారు వెళ్ళిపోయారా?" అనడిగాడు.

"నేను కూడా పిన్నితో వెళ్లి, రాత్రి వచ్చానండి. పవిత్రని విజయవాడకి తీసుకుని వెళ్తాను అని మిమ్మల్ని అడగడానికి వచ్చాను.  పట్టుచీరలు కొనాలి కదా!" అన్నాడు.

వర్ధని కాఫీ కప్పుతో వచ్చి శివకి కప్పు అందిస్తూ" కులాసానా బాబూ!" అని అడిగింది.

కప్పు అందుకుని " మీరెలా ఉన్నారు? బామ్మగారూ మీరు కులాసానా" అన్నాడు ఆవిడకి వినిపించేలాగా.

ఆవిడ చదువుతున్న విష్ణు సహస్రనామం పూర్తి చేసి, పుస్తకం మూసేసి పక్కనే ఉన్న చెక్క పెట్టెలో పెట్టి, రెండు చేతులతో ఓసారి ఆ పెట్టె కళ్ళకద్దుకుని నెమ్మదిగా లేచింది.

వర్ధని ఆవిడకి సాయం పట్టి లేపింది.

నాంచారమ్మ శివ కూర్చున్న దగ్గరగా వచ్చి, మాధవ పక్కన సోఫాలో కూర్చుంటూ కళ్ళజోడు తీసి కొంగుతో తుడిచి తిరిగి కళ్ళకు పెట్టుకుని, "డాక్టర్ గారు ఊళ్ళో లేరా? నిశ్చితార్థం అయ్యాక కనిపించలేదు" అంది.

"అవునండి. పిన్నితో హైదరాబాద్ వెళ్లాను. రాత్రే వచ్చాను". అన్నాడు.

"అలాగా! మీ పిన్ని, బాబాయ్ మళ్ళీ పెళ్లి సమయానికి వస్తారా?"

"అవునండి". కాఫీ తాగడం పూర్తి చేసి కప్పు టీపాయ్ మీద పెట్టి అన్నాడు. "మీరంతా అనుమతిస్తే పవిత్రని విజయవాడ తీసుకుని వెళ్తాను. సాయంత్రానికి వచ్చేస్తాము. పెళ్లి పట్టు చీరలు కొనాలి కదా".

“హైదరాబాద్లోనే మీ పిన్ని, మీరు వెళ్లి కొనకపోయారా?” అంది నాంచారమ్మ. ఆవిడ చూపుల్లో ఏదో తీవ్రత శివని ఇబ్బంది పెట్టింది.

“అంటే తనకి నచ్చాలి కదండీ” అన్నాడు.

“అవునులే. అది సరే. మా మోహన్ కి చాలా ప్రమాదం జరిగింది తెలుసా?” అనడిగింది ఆవిడ శివ మొహంలో భావాలు చదువుతున్నదానిలా చూస్తూ.

శివ ఉలిక్కిపడ్డాడు.”అరె! ఏమైంది?” ఆశ్చర్యంగా అడిగాడు.

“ఎవరో అతన్ని చంపడానికి ప్రయత్నించారు. బాగా గాయాలు అయినాయి.”

“అవునా! ఇప్పుడెలా ఉన్నాడు?” ఆత్రంగా అడిగాడు.

“హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. ఎలా ఉన్నాడో మాకు తెలియదు.” నిర్లిప్తంగా అంది ఆవిడ.

“అయ్యో అలాగా! నేను వెళ్లి చూడనా?” గబుక్కున లేచాడు.

మాధవ గంభీరంగా అన్నాడు. “కూర్చోండి. వాళ్ళ డాక్టర్ రోజూ వచ్చి చెకప్ చేసి వెళ్తున్నాడు.”

శివ బాధగా అన్నాడు. “ అతని మీద ఈ ఊళ్ళో హత్యా ప్రయత్నం ఎవరు చేస్తారు? అలా జరిగి ఉండదు. ఏదన్నా ప్రమాదం జరిగిందేమో! చాలా మంచివాడు. బుద్ధిమంతుడు. అతనంటే ఎవరికీ కక్ష ఉంటుంది? ఎందుకుంటుంది?”

ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

పవిత్ర మొహం కడుక్కుని, తల దువ్వుకుని, నైటీ మార్చుకుని, తెల్లని పరికిణీ, ఓణీ వేసుకుని వచ్చింది.

మల్లెచెండులా ఉన్న ఆమె వైపు ఆరాధనగా చూసాడు శివ.

మాధవ అన్నాడు. “ రెండు రోజులాగండి. మేమూ కొనాలి కదా! అందరం కలిసి వెళ్దాం విజయవాడకి.”

శివ నిరుత్సాహంగా చూసాడు. పవిత్రని ఈ వంకతో విజయవాడ తీసుకుని వెళ్లి, సాయంత్రం దాకా గడపచ్చు అనుకున్నాడు. ఆయన అలా అనగానే నిరాశగా అనిపించింది.

ఏమి మాట్లాడలేక అన్నాడు. “బాగా చదువుతున్నావా పవిత్రా! పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి కదా!”

పవిత్ర మాట్లాడకుండా తల వంచుకుంది.

“చదువు మానేసింది “

ఆశ్చర్యంగా చూసాడు “చదువెందుకు మానేసావు?”

“తను మానేయలేదు. నేనే మాన్పించాను. తనేం ఉద్యోగం చేయక్కర్లేదు కదా! మీరు మీ వృత్తిలో చాలా బిజీగా ఉంటారు. ఇంటికి వచ్చేసరికి తను ఇల్లు చక్కదిద్దుకుని, మీకు సంతోషం పంచాలి. అంతగా అయితే పెళ్లి తరవాత మీరు చదివించుకోవచ్చు” అన్నాడు మాధవ.

శివకి కోపం వచ్చింది. కాలేజ్ కి వెళితే తరచూ ఇద్దరూ కలుసుకోవచ్చు. ఇప్పుడు ఆ అవకాశం పోయింది. ఈయనకి పిచ్చా? అనుకున్నాడు. తమాయించుకుని అన్నాడు. "చదువుకుంటే లోకజ్ఞానం తెలుస్తుంది. తనకి ఇంగ్లీష్ బాగా రాదు. రేపు నాకున్న సర్కిల్ లో ఇంగ్లీష్ మాట్లాడకపోతే ఎలా? పెళ్లి అయేదాకా చదవనివ్వండి. ఎంత దూరం ఉంది కాలేజ్? రెండు ఫర్లాంగులు కూడా లేదు కదా!" అన్నాడు.

ఆయన మాట్లాడలేదు. ఆయనకి శివ మీద ఎందుకో సదభిప్రాయం కలగడం లేదు. అయినా ఇప్పుడు చేయగలిగింది ఏముంది? దాని తలరాత ఎలా ఉంటె అలా జరుగుతుంది. అనుకుని నిట్టూర్చాడు. పైకి నెమ్మదిగా అన్నాడు."ఆలోచిద్దాం లెండి".

శివ లేచి నిలబడి కొంచెం ఆజ్ఞాపిస్తున్నట్టు అన్నాడు. "సాయంత్రం వస్తాను రెడీ గా ఉండు పవిత్రా! అలా షికారుకి వెళదాం".

పవిత్ర తండ్రి వైపు చూసింది. ఆయన మాట్లాడలేదు.

నాంచారమ్మ కలగచేసుకుని అంది. "ఎంత! నెలరోజులు. ఆ మూడుముళ్ళు పడ్డాక మిమ్మల్ని ఎవరు కాదంటారు? పెళ్ళికి ముందే అలా తిరిగితే నలుగురూ నాలుగు మాటలు అంటారు."

శివకి కోపం నసాళానికి అంటింది. "నాకు కాబోయే భార్యండి. ఎవరేమన్నా పట్టించుకోను. అయినా కాలం మారింది. మీ కాలం కాదుకదా !" అని "సాయంత్రం వస్తాను" అని పవిత్రకి చెప్పి, అందరి దగ్గరా సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

అక్కడ పిన్ డ్రాప్ సైలెన్స్ ఏర్పడింది.

పవిత్ర తల వంచుకుని నెమ్మదిగా నడుస్తూ పైకి వెళ్ళింది.

"బుద్ధిమంతుడు, మర్యాదస్తుడు అనుకున్నాను. తలపొగరు బాగానే ఉన్నట్టుంది" అంది నాంచారమ్మ.

మాధవ కొన్ని క్షణాలు మాట్లాడలేదు. తల పంకిస్తూ అన్నాడు."కానీ ఏం చేస్తాం? కాబోయే భార్య కదా! అతనికీ సరదాలుంటాయి."

అన్నట్టుగానే సాయంత్రం నాలుగు అవుతుండగా వచ్చి కారు హారన్ మోగించాడు శివ.

అప్పటికే పవిత్ర తయారై ఎదురుచూస్తోంది. ఆమెకి చాలా టెన్షన్ గా ఉంది. తండ్రి వెళ్ళు అన్న మాట అనకుండా బయటకు వెళ్ళిపోయాడు. నానమ్మ మౌనంగా ఉంది. వర్ధని మాత్రం రెండుసార్లు చెప్పింది. "త్వరగా వచ్చేయి. పొద్దుపోయిందాకా ఉండకు." అని.

అతని కారు హార్న్ శబ్దం రాగానే గబగబా మెట్లుదిగి వచ్చి, చివరి మెట్టు మీద ఆగిపోయి నాంచారమ్మ వైపు చూసింది.

ఆవిడ నెమ్మదిగా అంది. "వెళ్ళు. జాగ్రత్త."

పవిత్ర క్షణం కూడా ఆగలేదు. పరుగులాంటి నడకతో వీధి వాకిట్లోకి వచ్చింది.

శివ అసహనంగా ఎదురుచూస్తున్నాడు. ఆమె కారు ఎక్కగానే, "ఇంతసేపా!" అన్నాడు స్టార్ట్ చేస్తూ.

"కొంచెం భయం వేసింది" అంది.

"నీకసలు బుద్ధిలేదు. కాలేజ్ ఎందుకు మానేసావు?"

"నాన్న వెళ్ళద్దు అన్నారు."

"అయితే మానేస్తావా? చదువుకోకుండా ఏం చేద్దామని? రేపు నా ఫ్రెండ్స్ కి పరిచయం చేసినప్పుడు ఏం చెప్పను? చదువులేని మొద్దు అని చెప్పనా?" కోపంగా అన్నాడు.

పవిత్ర బిత్తరపోయి చూసింది.

"డిగ్రీ అన్నా పూర్తి చేస్తే నాకూ గౌరవం నీకూ గౌరవం. పెళ్ళయాక చదువుకో."

"సరే" నెమ్మదిగా అంది.

"అది సరే ఆ మోహన్ కి ప్రమాదం జరిగింది అన్నారు. అసలేం జరిగింది?" అడిగాడు.

"తెలియదు. అదే మిమ్మల్ని అడగాలని అనుకున్నాను. ఎవరో కొట్టారుట. మన ఊళ్ళో రౌడీలు ఎవరున్నారు?"

చిరాగ్గా అన్నాడు శివ" రౌడీలు ఎవరున్నారు అని నన్నడుగుతావెం? నేనేం వాళ్ళని పోషిస్తున్నానా?"

చాలా రోజుల తరవాత కలుసుకున్న ఆనందం ఆవిరి అవుతోంది పవిత్రకి. ఇవాళ అతని మాటల ధోరణి విచిత్రంగా ఉంది. తనని చూడగానే ప్రేమగా చుట్టేస్తాడు అనుకుంది. వారం రోజుల వియోగం తట్టుకోలేకపోయాను. ఎప్పుడెప్పుడు చూస్తానా అని తపించాను... ఇలాంటి కబుర్లు చెప్తాడు అనుకుంది. ఎందుకో అసహనంగా, చిరాగ్గా ఉన్న అతని ధోరణికి చిన్నబుచ్చుకుంటూ అంది. "మీరెందుకు కోపంగా ఉన్నారు?"

ఆమె స్వరంలో వినిపించిన బాధకి తనని తాను తమాయించుకుని అన్నాడు. "నిన్ను విజయవాడ తీసుకుని వెళ్ళి, మంచి చీరలు, నగలు కొనాలి అనుకున్నా. మంచి హోటల్ కి వెళ్లి, అక్కడినుంచి  సినిమాకి తీసుకుని వెళ్ళాలి అనుకున్నాను. మీ నాన్న నేను నిన్ను కొరుక్కు తింటానేమో అన్నట్టు అందరం వెళ్దాం అన్నాడు. కాబోయే అల్లుడిని, డాక్టర్ ని నా మీద నమ్మకం లేదా? అయినా అసలు ఆయన అనుమతి నాకు అవసరమా? ఈ క్షణం నిన్ను ఎత్తుకుని వెళ్తే ఏం చేస్తాడు? అందుకే కోపం వచ్చింది". అన్నాడు.

జాలేసింది పవిత్రకి. "పరిస్థితులు బాగాలేవు. మోహన్ కి జరిగిన ప్రమాదంలో మా కుటుంబం పాత్ర ఉందని వాళ్ళు నమ్ముతున్నారు. మాతో మాట్లాడడం లేదు. రెండు కుటుంబాల మధ్య ఒక అగ్ని రగులుతోంది. మా వాళ్ళు చాలా బాధపడుతున్నారు మోహన్ కి అలా అయినందుకు."

"నువ్వు కూడానా" ఆమె వైపు చూసి, మొహంలో భావాలు వెతుకుతూ అడిగాడు.

బాధగా అంది పవిత్ర. "నాకూ బాధగానే ఉంది పాపం. అసలే నా పెళ్లి నిశ్చయం అయిందన్న బాధ, దానికి తోడు ఇలా జరిగింది. బాధగా ఉండదా?"

"ఓహో. అంత బంధం ఉందా మీ రెండు కుటుంబాల మధ్య" అతని స్వరంలో స్పష్టంగా ధ్వనించింది ఈర్ష్య. అయితే ఆ ఈర్ష్యలోని ధ్వని పవిత్రకి అర్థం కాలేదు. అందుకే మార్దవంగా అంది. "బంధం అంటే బంధం అని కాదు... మా నాన్న, వాళ్ళ నాన్న బిజినెస్ పార్టనర్స్... మంచి స్నేహితులు. ఆవిడకి నేనంటే చాలా ఇష్టం. నానమ్మ అంటే ఎంతో భక్తి..."

"మోహన్ కి కూడా నువ్వంటే ఇష్టమేగా"

"అవును పాపం. ఆ విషయం చెప్పినందుకే నాన్న, నానమ్మ అతన్ని తిట్టారు. నేను కూడా చాలా అవమానించాను. ఏంటో బాధగా అనిపిస్తోంది." నిట్టూరుస్తూ అంది పవిత్ర.

ఏదో అనబోయిన శివ ఆగిపోయి "సరేలే! ఎక్కడికి వెళదాం విజయవాడ వెళ్లి కాసేపు కృష్ణ ఒడ్డున గడిపి వద్దామా? మహా అంటే రెండు గంటల్లో వచ్చేస్తాం" అన్నాడు.

"అమ్మో వద్దు. నాన్న చంపేస్తాడు. నానమ్మ, అమ్మా, త్వరగా వచ్చేయమని చెప్పారు కూడా." కంగారుగా అంది.

"మరెందుకు రావడం ఇంట్లోనే కూర్చోకపోయవా?"

అతని స్వరంలో వినిపించిన తీవ్రతకి కొంచెం బెదిరి అంది. "కోపం ఎందుకు? మీ ఇంటికి వెళదాం. లేదంటే మనం ఎప్పుడూ వెళ్ళే పట్టాల మీదకి వెళ్లి కూర్చుందాం"

"పట్టాల మీదకి వద్దు. మా ఇంటికి వెళ్దాం పద" అన్నాడు కొంచెం స్వరం మృదువుగా మార్చి.

కారు శివ ఇంటి ముందు ఆగింది. ఎప్పటిలా వాచ్ మాన్ వచ్చి గేటు తీయలేదు. శివే కారాపి, గేటు తెరిచి, మళ్ళీ కారులో కూర్చుని, పార్కింగ్ దగ్గర ఆపాడు. డోర్ తీస్తూ, దిగు అన్నాడు.

"వాచ్ మాన్ రాలేదా?" అడిగింది పవిత్ర.

"లేదు మానేశాడు. రావడం లేదు" ముక్తసరిగా చెప్పి, జేబులో నుంచి తాళం చేతులు తీసి, ఇంటి తాళం తీసాడు.

అతనెందుకు తను ఊహించినట్టు ఉత్సాహంగా, అల్లరిగా లేడో అర్థం కాక, అయోమయంగా లోపలికి నడిచింది. వెంటనే తలుపు వేసేశాడు శివ. ఒక్క క్షణం వణికింది పవిత్ర.

శివ సోఫాల మీద చిందరవందరగా పడి ఉన్న బట్టలు తీసి, లోపల గదిలో పడేసి వచ్చాడు. ఎప్పుడూ శుభ్రంగా ఉండే ఇల్లు ఆవేళ చిందరవందరగా ఉండడంతో కారణం ఆలోచిస్తూ పరధ్యానంగా నిలబడిన పవిత్ర, శివ రెండు చేతులతో పట్టుకుని వెళ్తున్న బట్టల్లో చీర వ్రేళ్ళాడుతూ ఉండడం గమనించలేదు.

అతను తిరిగి వచ్చి, నిలబడిన పవిత్ర చేయిపట్టుకుని దగ్గరకు లాక్కోడంతో తూలి, అతని గుండెల మీద పడింది.

"అబ్బ ఎన్నిరోజులైంది ఈ పుత్తడిబొమ్మని చూసి. నీకసలు కొంచెం కూడా దిగులు, చింతా లేవేం?" అన్నాడు చెంపల మీద ముద్దుపెట్టుకుంటూ.

"మీకేం తెలుసు ఎంత బెంగ పెట్టుకున్నానో! కాలేజ్ కి వెళ్ళద్దు అని నాన్న అల్టిమేటం ఇవ్వగానే బాగా ఏడ్చాను. మీకోసం ప్రతి రోజూ ఎదురుచూసాను." అతని మెడ చుట్టూ చేతులు వేసి మరింతగా ఒదిగిపోతూ అంది.

"మీ నాన్నకి అసలు బ్రెయిన్ లేదు." కోపంగా అన్నాడు.

ఆ మాటకి పవిత్ర మనసు చివుక్కుమంది. తన తండ్రిని అంతమాట అనడం నచ్చలేదు ఆమెకి. ఏదో అనబోయేంతలో అతనే అన్నాడు. "ఎంత ఆశ పెట్టుకున్నానో విజయవాడ వెళ్లాలని. ఛ... నా ఆశలన్నీ ఆవిరి చేసాడు. అసలేవిటి ఈ రిస్ట్రిక్షన్స్? మరీ ఇంత పాతకాలం మనిషేంటి మీ నాన్న?"

"అదికాదు... మోహన్ కి ..." ఆమె మాటలకి అడ్డువస్తూ కోపంగా అన్నాడు. "మోహన్...మోహన్. ఎవడా మోహన్? మనకీ, వాడికీ లింకేంటి? వాడి చావు వాడు చస్తాడు. వాడి కోసం మనకి ఈ ఎడబాటు అవసరమా?"

పవిత్రకి ఏమాత్రం అతని మాటలు నచ్చలేదు. మోహన్ విషయంలో అతనంత మర్యాద లేకుండా మాట్లాడడం అసలు నచ్చలేదు. గబుక్కున కొంచెం దూరం జరిగి అంది. "అలా మాట్లాడకండి. తోటి మనిషి కష్టంలో ఉంటె అలా అనచ్చా. పైగా నా వల్లనే ఆ అబ్బాయికి కష్టాలు వచ్చాయని వాళ్ళు మా మీద కోపంగా ఉన్నారు."

"నువ్వేంటి? వాడి మీద ఇంత సానుభూతి చూపిస్తున్నావు?" హేళనగా అన్నాడు.

పవిత్రకి ఇవాళ ఈ శివలో మునుపటి శివ కనిపించలేదు. ఏదో తేడా.. మాటల్లో, చేతల్లో, హావభావాల్లో. ఎందుకిలా మాట్లాడుతున్నాడు? ఇదంతా నాన్న విజయవాడ పంపనందుకు కోపమా? లేక ఇతని స్వభావమే ఇంతా! శివ మారాడా? ఎందుకు? ఎలా మారాడు? మోహన్ అంటే ఇష్టం లేదు కనీసం మానవత్వం ఉండాలి కదా!

చాలా రోజుల తరవాత అతనలా దగ్గరకు లాక్కోడంతో ఆ స్పర్శ సర్వం మర్చిపోయేలా చేసింది. కానీ, ఇప్పుడు మనసంతా చేదు తిన్నట్టు అయింది. ఇంటికి వెళ్లిపోవాలి అనిపించింది.

"ఏంటి ఆలోచిస్తున్నావు? మోహన్ ని అంటున్నందుకు కోపమా?" మళ్ళీ దగ్గరగా లాక్కున్నాడు.

కోపం లేదు కానీ ఏదో సందేహం... అసంతృప్తి. చెప్పాలనుకుంది.

అతనా అవకాశం ఇవ్వలేదు. మరో మాటకి అవకాశం ఇవ్వకుండా అతని పెదవులు, ఆమె పెదవులని బంధించాయి.

మనసు, శరీరం కూడా ఆ స్పర్శకి పులకిస్తూ, నిశ్చేతనం అయ్యాయి. పరిసరాలు శివ రూపంతో నిండిపోయాయి. సర్వం మర్చిపోతూ ఉన్న ఆ సమయంలో వీపు మీద చరిచినట్టు వినిపించింది నానమ్మ స్వరం."జాగ్రత్త, త్వరగా రా" .

ఉలిక్కిపడి దూరం జరిగి అంది "నానమ్మ త్వరగా రమ్మంది... అమ్మ కూడా".

"నాన్నమ్మ లేదు, ఎవరు లేరు... నువ్వు, నేనే ఉన్నాము". అంటూ తిరిగి చేయి పట్టుకుని బలంగా లాగుతోంటే బలవంతంగా విడిపించుకుని ఒగరుస్తూ అంది. "లేదు వెళ్లిపోవాలి. please నన్ను డ్రాప్ చేయండి. రేపు వస్తాను."

"లేదు వదలను. నాకు కావాలి." అతను మరింత బలంగా ఆమెని పొదివిపట్టుకుని బెడ్ రూమ్ వైపు నడుస్తొంటే పెనుగులాడుతూ దూరం జరిగి "ఎందుకు తొందర పడుతున్నారు? ఇంకో నెలలో మన పెళ్లి. పెళ్లి తరువాత పొందాల్సిన తీయని అనుభవాలు ఇప్పుడే పొంది, అప్పటికి పాతబడి పోవడం నాకు ఇష్టం లేదు. మన మొదటిరాత్రి జీవితమంతా గుర్తుండి పోయే మధురానుభూతి కావాలి. వదలండి. ఎందుకింత ఆవేశం? నేను మీ దాన్ని. ఎక్కడికి పోతాను?" దుఃఖం, ఆర్ద్రత మిళితమైన గొంతుతో బతిమాలింది.

విసుగ్గా వదిలేసి అన్నాడు "పద దింపేస్తాను. ఛ. ఎంత ఆశతో, ఎన్ని ఊహలతో వచ్చాను. నా మూడ్ మొత్తం పాడు చేసారు తండ్రి,కూతుళ్ళు. పద" విసురుగా బయటకి నడిచాడు.

ఏడుపొచ్చింది పవిత్రకి. "అపార్ధం చేసుకోకండి. ఇప్పటికే పెళ్లి అవబోతున్నదన్న ఆనందం మాయం అయింది ఇంటి దగ్గర పరిస్థితి కి. మీరిలా అంటే నేను భరించలేను. ప్లీజ్ కోపం తెచ్చుకోవద్దు."

అతనేం మాట్లాడలేదు. సీరియస్ గా స్టీరింగ్ తిప్పాడు.

పవిత్రకి ఏడుపు వచ్చింది. ఉన్నట్టుండి బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టింది.

"ఏయ్ ఎందుకు ఏడుస్తున్నావు? నీ ఏడుపు చూసి నేనేదో అన్నాను అనుకుంటారు మీ వాళ్ళు. ఏడవకు. నాకు కోపం లేదులే ఏడవకు. ఏదో చికాకులో విసుక్కున్నాను. సారీ " ఆమె భుజం మీద చేయి వేసి అనునయంగా అన్నాడు.

"నిజంగా కోపం లేదా?" వెక్కుతూ అడిగింది.

"లేదు. సరేనా! నవ్వు ...నవ్వూ"

కొలనులో విచ్చుకున్న కమలం అయింది ఆమె వదనం.

కారు ఇంటి ముందు ఆపి, "రేపు ఎలాగోలా రా, తప్పకుండా రా. ఇలా ఏడుపు మొహంతో కాదు, చక్కగా నవ్వుతూ, రొమాంటిక్ గా రావాలి" అన్నాడు.

"అలాగే" నవ్వి, డోర్ తీసుకుని వెళ్ళిపోయింది.

మరునాడు ఉదయం పవిత్ర నిద్రలేచి కిందకి వచ్చేసరికి, వర్ధని, నాంచారమ్మ వరండాలో నిలబడి ఉన్నారు. వీదివాకిట్లో ట్రక్ ఒకటి, రెండు పెద్ద కార్లు ఆగి ఉన్నాయి. పక్క ఇంట్లో నుంచి సామాను తీసుకొచ్చి వాటిలో పెడుతున్నారు కొందరు వ్యక్తులు.

"చాముండేశ్వరి వాళ్ళు ఇల్లు ఖాళీ చేస్తున్నార్రా" కంగారుగా చెప్పింది నాంచారమ్మ అప్పుడే అటు వచ్చిన మాధవతో.

మాధవ గుండె కలుక్కుమంది. పార్ధసారధి ఒక్క ముక్క కూడా తనతో సంప్రదించకుండా వ్యాపారంలో భాగస్వామ్యం వదులుకోడం కాక, చెప్పా, పెట్టకుండా ఇల్లు వదిలి వెళ్ళిపోతున్నాడు అంటే ఇంక ఈ బంధం శాశ్వతంగా తెగిపోయినట్టే. తనేం పాపం చేసాడు?

ఆయన ఆవేశంగా, వేగంగా పక్కింటి గేటు వైపు వెళ్ళాడు. అప్పుడే పార్ధసారథి, చాముండేశ్వరి, వాళ్ళ వెనకాలే మోహన్ కారు దగ్గరకు వస్తున్నారు.

మాధవ పార్ధసారథి దగ్గరగా వెళ్లి ఆయన చేతులు పట్టుకుని గాద్గదికంగా అన్నాడు." సారధిగారూ! మీకిది ధర్మంగా ఉందా? ఎందుకు వెళ్ళిపోతున్నారు? చిన్న, చిన్న మనస్తాపాలు వస్తాయి, పోతాయి. అంతమాత్రాన బంధాలు తెంచుకుంటామా? నా మాట వినండి. వెళ్ళద్దు. "

ఆయనలా వెళ్ళడం చూసిన వర్ధని, నాంచారమ్మ కూడా ధైర్యం తెచ్చుకుని, పరుగున వెళ్లి చాముండేశ్వరి చేతులు పట్టుకుని బతిమాలుతూ అన్నారు. "మేము చేసిన తప్పులు మన్నించమ్మా! ఏదో ఆడపిల్ల వాళ్ళం మనసుకి కష్టం కలిగి అన్నాము. అంతేగానీ మీ చెడు కోరుకుంటామా? మీ అబ్బాయి మా అబ్బాయి కాదా! అపార్ధాలతో వెళ్ళకండి. ఆగిపొండి"

పార్ధసారథి దుఃఖం నిగ్రహించుకుంటూ అన్నాడు. "మీమీద కోపంతో వెళ్ళడం లేదండి. మా అబ్బాయి భవిష్యత్తు ఆలోచించి వెళ్తున్నాం. ఎక్కడున్నా కొంచెం స్థిమిత పడ్డాక తప్పకుండా వచ్చి కలుస్తాము. మమ్మల్ని వెళ్ళ నివ్వండి."

చాముండేశ్వరి కళ్ళనీళ్ళ తో నమస్కరిస్తూ అంది."మీమీద మాకేం కోపం లేదు పిన్నిగారూ! మా పెద్దబ్బాయి కూడా అక్కడికి వచ్చేయమన్నాడు అందుకే వెళ్తున్నాం".

"అయితే, వచ్చి పసుపు కుంకుమ తీసుకుని వెళ్ళు. నా మాట కాదనద్దు "

"టైం అయిందండీ. వెళ్ళాలి. మరోసారి వస్తాను"

"కుదరదు. పసుపుకుంకుమ తీసుకోకుండా నువ్వు గేటు దాటద్దు." ఆజ్ఞాపించినట్టు అంది నాంచారమ్మ.

ఆవిడ భర్తవైపు చూసింది.

ఆవిడ భుజం మీద తట్టి "వెళ్ళు " అన్నాడు పార్ధసారధి.

"మీరూ రండి ఒక కప్పు కాఫీ తాగి వెడుదురుగాని " ఆహ్వానించాడు మాధవ.

ఆయన మోహన్ వైపు చూసి, "నువ్వు కారులో కూర్చో " అని చెప్పి, పక్కింటి గేటు వైపు నడిచాడు. అందరూ ఆయన్ని అనుసరించారు.

అప్పటివరకు చిత్తరువులా నిలబడిపోయిన పవిత్ర, వాళ్ళు రావడం చూసి పరిగెత్తుకుంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది.

వర్ధని తను సంక్రాంతి పండక్కి కొనుక్కున్న కంచి పట్టు చీర ఒకటి తీసి, దొడ్లో పూసిన గులాబీపూలు, పళ్ళు , పసుపు, కుంకుమ ఇచ్చింది చాముండేశ్వరి కి. నాంచారమ్మ అందరికీ కాఫీ కలిపి తీసుకువచ్చి ఇచ్చింది.

పది నిమిషాల తరువాత, కొంచెం శాంతించిన మనసులతో వాళ్లకి వీడ్కోలు చెప్పారు వర్ధని దంపతులు, నాంచారమ్మ.

కిటికీలో నుంచి కదులుతున్న వాళ్ళ కారు చూస్తూ కన్నీళ్లు తుడుచుకుంది పవిత్ర.

ఆ రోజుతో పవిత్ర జీవననాటకంలో ప్రధమాధ్యాయం కి తెరపడింది

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS